క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్ పనులు జరిగే ప్రాంతాలైన మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశం బజార్, మాన్యంచెల్క, దారుషాషా కాలనీ, బస్టాండ్, డాక్టర్స్ కాలనీ, బీటీఎస్, శంస్నగర్, భారత్ గ్యాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేత్రాల సేకరణ

నల్లగొండ: పట్టణంలోని మునుగోడు ఎక్స్ రోడ్డుకు చెందిన అలుగుబెల్లి వెంకట్రెడ్డి ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ స్నేహ ప్రెసిడెంట్ యాసా సరళ మృతుడి కుటుంబ సభ్యుల అనుమతితో వెంకట్రెడ్డి నేత్రాలు సేకరించారు.

చర్యలు తీసుకోవాలి

చండూరు : తాటి, ఈత చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మునుగోడు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో తాటి, ఈత వనాలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేస్తున్నారని అన్నారు. చెట్లను నరికివేయడంతో గీత కార్మికులు తమ వృత్తికి దూరమయ్యే అవకాశం ఉందన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

చండూరు : గట్టుప్పల్, చండూరు మండలాల పరిధిలో ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు చేసిన ఉపాధి హామీ పనులకు గాను క్షేత్ర స్థాయిలో సోమవారం నుంచి సామాజిక తనిఖీలు మొదలు కానున్నాయి. ఉపాధి హామీ పనులు రూ.2 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని నిర్వహించిన రూ.5 కోట్ల విలువ గల పనులపై తనిఖీలు చేయనున్నారు. ఇప్పటికే మండలాల పరిధిలోని అన్ని గ్రామాలకు తనిఖీ బృందాలు చేరాయి.

రైతులకు నష్టం కలిగించొద్దు

మునుగోడు: రైతుల భూముల నుంచి ఇష్టానుసారంగా పైపులైన్ వేసి రైతులకు నష్టం కలిగించవద్దని కిష్టాపురం గ్రామ రైతు బోయ లింగస్వామి అధికారులను కోరారు. ఆదివారం ఆయన మునుగోడులో విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని కిష్టాపురం గ్రామంలోని పలువురు రైతుల వ్యవసాయ భూముల నుంచి పైపులైన్ వేస్తున్నారని, అది ప్రైవేటుదా ప్రభుత్వానిదా అని అడిగితే స్థానిక రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పడం లేదన్నారు. వెంటనే పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా కో కన్వీనర్గా మల్లేష్



కట్టంగూర్ : బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కో కన్వీనర్గా కట్టంగూర్కు చెందిన యర్కల మల్లేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ లింగంపల్లి చిరంజీవి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

లయన్స్ క్లబ్ సభ్యులకు సన్మానం



క్లబ్ సభ్యులను సన్మానిస్తున్న హరినాథ్

నల్లగొండ టౌన్: లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసి 50 ఏళ్లయిన సందర్భంగా ఆదివారం లయన్స్ క్లబ్ సభ్యులను క్లబ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కడిమి హరినాథ్ ఆధ్వర్యంలో జగిని భీమయ్య, కంబంపాటి కోటేశ్వర్రావు, అమరేందర్రావు, వెంకటపతిలను సన్మానించారు. అనంతరం క్లబ్ సావనీర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సునిల్కుమార్ రుమాల్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యారాల ప్రభాకర్ రెడ్డి, కే.వి.ప్రసాద్, గోలి అమరేందర్ రెడ్డి, తీగల మోహన్రావు, నేతి రఘుపతి, యానాల మోహన్రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలి

నార్కట్పల్లి : అర్హత ఉన్న వారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి రాపోలు గాయత్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నార్కట్పల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజా పాలనలో కొత్త రేషన్ కార్డు కోసం చాలామంది నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అధికారులు అర్హత ఉన్న పేదవారికి రేషన్ కార్డులు మంజూరు చేయడంలేదని ఆరోపించారు.

రాష్ట్ర సెక్రటరీగా నాజర్ అలీమీర్జా

మిర్యాలగూడ అర్బన్ : మానవ హక్కుల రక్షణ, సంక్షేమ అవగాహన సంస్థ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన మహ్మద్ నాజర్అలీ మీర్జా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ అధ్యక్షుడు గొట్టిముక్కుల మాధవాచారి ఆదివారం నియామక పత్రం అందజేశారు.

అర్హులకు అందని ఆసరా పింఛన్ !

- సదరం సర్టిఫికెట్ ఇచ్చి రెండేళ్లు దాటినా ఎదురుచూపులే
- మరో ఆరు నెలల్లో ముగియనున్న సర్టిఫికెట్ గడువు
- 3 వేలకు పైగానే పెండింగ్లో దరఖాస్తులు



నల్లగొండ టూటౌన్ : అర్హులైన వారందరికీ ఆసరా పెన్షన్లు అందిస్తామని పాలకులు చెబుతున్నారే తప్ప ఆచరణలో మాత్రం చూపించడంలేదు. అర్హులైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు ఉన్నా పింఛన్ అందని పరిస్థితి నెలకొంది. గతంలో మునుగోడు ఉప ఎన్నికల సమయంలో అర్హులందరికీ ఆసరా పింఛన్ఇస్తామని చెప్పి అప్పటి పాలకులు మాట తప్పారనే ప్రచారం ఉంది. అప్పటి ప్రభుత్వం దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడంతో మున్సిపల్ కార్యాలయాల్లో చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్క నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోనే ఆసరా పింఛన్ల కోసం 3 వేలమందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఉన్నారు. దివ్యాంగులకు ఆసరా పింఛన్ ఇవ్వాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం సదరం క్యాంపులో ప్రభుత్వ వైద్యులు ఇచ్చిన సదరం సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. ఇలా వందలాది మంది దివ్యాంగులు అష్టకష్టాలు పడి సదరం క్యాంపులకు వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చుకుని ఏళ్లు గడుస్తున్నా నేటికీ వీరికి పింఛన్ అతీగతి లేదు. తాము ఎన్నికల్లో గెలిస్తే వృద్ధులు, వితంతులకు రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పెట్టింది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నేటికీ పింఛన్ల పెంపు కానీ, కొత్త పింఛన్లు ఇస్తామని కానీ ప్రభుత్వం చెప్పడంలేదు. పింఛన్ల కోసం కార్యాలయం చుట్టూ దరఖాస్తు చేసుకున్న వారు తిరిగిపోతున్నారు. పింఛన్ వస్తుందా.. రాదా అనే విషయం దరఖాస్తుదారులకు చెప్పేవారు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

సర్టిఫికెట్ ఇచ్చి రెండున్నరేళ్లు ..

నల్లగొండ పట్టణంలోని చైతన్యపురి కాలనీలో నివాసం ఉంటున్న సింగిరెడ్డి సంతోష్రెడ్డి కుమార్తె ధృతి దివ్యాంగురాలు. ధృతికి 2022 జూన్ 30వ తేదీన నల్లగొండలోని గొల్లగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురు వైద్యుల బృందం సదరం సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ సర్టిఫికెట్ గడువు మూడేళ్లు పూర్తయితే మరోసారి సదరం క్యాంప్నకు వెళ్లికి సర్టిఫికెట్ తీసుకోవాలని వైద్యులు గడువు పెట్టారు. ఈ బాలిక సరిగా నడవడం కానీ, చేతులు పైకి లేపడంగానీ చేయలేదు. కింద కూడా కూర్చోలేని స్థితిలో ఉంది. 8వ తరగతి చదువుతున్న బాలికను తీసుకుని ఆమె తాత నీలగిరి మున్సిపల్ కార్యాలయం వచ్చి పింఛన్ గురించి అధికారులను వాకబు చేశారు. పింఛన్ మంజూరు విషయం తమకు తెలియదని అధికారులు వారికి చెప్పారు. మరో ఆరు నెలల్లో సదరం సర్టిఫికెట్ గడువు ముగిసే సమయం వచ్చినా పింఛన్ అందకపోవడంతో వారు నిరాశతో వెళ్లిపోయారు. ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు వందల మంది ఆసరా పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకుని ఉన్నారు. అర్హులైన దివ్యాంగులకు కొత్త పింఛన్లు ఇవ్వకపోవడంతో ఎప్పుడు మంజూరు అవుతుందోనని ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు కోరుతున్నారు.



సదరం సర్టిఫికెట్తో బాలిక ధృతి

ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేయిస్తాం

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: నియోజకవర్గంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేయించి కంటి సమస్యలు లేకుండా చికిత్స చేయిస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫినిక్స్ ఫౌండేషన్ సౌజన్యంతో హైదరాబాద్లోని శంకర కంటి ఆస్పత్రి వైద్య సిబ్బందితో మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్నప్పటికీ అనేక మంది పేదరికం కారణంగా వైద్యం చేయించుకోలేక పోతున్నారన్నారని అన్నారు. అలాంటి వారికి తాను అండగా ఉంటానని, నియోజకవర్గంలోని ఏడు మండలాలతో పాటు మున్సిపల్ కేంద్రాల్లో నెలకు ఒకటి చొప్పున వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. శిబిరంలో పరీక్షలు చేయించుకున్నవారికి అవసరమైన శస్త్ర చికిత్సతోపాటు మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరు కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మునుగోడులో నిర్వహించిన శిబిరంలో దాదాపు 1200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, నారబోయిన రవి ముదిరాజ్, పాశం సురేందర్ రెడ్డి, వట్టికోటి శేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్రెడ్డి, జితేందర్ రెడ్డి, పాల్వాయి చెన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, దోటి నారాయణ, మందుల బీరప్ప, ఎండీ అన్వర్, అనంత లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డి, లక్ష్మి

రైతు మహాధర్నాను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్లో ఈ నెల 21న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు మహాధర్నాను జయప్రదం చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం నకిరేకల్లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్రెడ్డి రైతులకు ఇచ్చిన ఏఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా 30శాతం మంది రైతులకు కూడా రూ.2 లక్షల రుణమాఫీ అమలు కాలేదన్నారు. రెండు నెలల క్రితమే నాలుగో విడత రుణమాఫీ రైతుల జాబితాను విడుదల చేసిన ప్రభుత్వం.. నేటికీ డబ్బులు జమ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను ఎగ్గొట్టిందని, ఒక్కో ఎకరాకు రూ.17,500 బాకీ పడిందన్నారు. 21న ఉదయం 10 గంటలకు జరిగే మహాధర్నాలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీష్రెడ్డి పాల్గొంటారని తెలిపారు. మహా ధర్నాకు నియోజకవర్గం నుంచి రైతులు, పార్టీ శ్రేణులు భారీఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్రావు, మారం వెంకట్రెడ్డి, నాయకులు గోమ యాదగిరి, గొర్ల వీరయ్య, రాచకొండ వెంకన్న, తేనెల లింగారెడ్డి, సామ శ్రీనివాస్రెడ్డి, నోముల కేశవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: క్రీడల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య స్మారకార్థం నకిరేకల్లోని ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి షటిల్, క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అంతకు ముందు నోముల నర్సింహయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే వీరేశం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రజిత, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, క్రీడల నిర్వహణ అధ్యక్షుడు కొండ యాదగిరి, బొజ్జ సుందర్, వార్డు కౌన్సిలర్లు గాజుల సుకన్య, ఏసారపు లక్ష్మి వెంకన్న, గర్షకోటి సైదులు, బానోతు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

21నుంచి గ్రామసభలు

రామగిరి(నల్లగొండ): రైతు భరోసా, ఆహార భద్రత కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు నల్లగొండ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి సయ్యద్ముసాబ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు గ్రామసభలకు హాజరుకావాలన్నారు.

నార్కట్పల్లి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అర్హులైన వారిని గుర్తించేందుకు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నార్కట్పల్లి మండలంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉమేష్ తెలిపారు. ఈ నెల 21న చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం, ఏపీ లింగోటం, చిన్నతుమ్మలగూడెం, చిప్పలపల్లి, పల్లెపహాడ్, అక్కెనపల్లి, చౌడంపల్లి, 22న నార్కట్పల్లి, దాసరిగూడెం, మాధవ ఎడవల్లి, మాండ్ర, చిన్ననారాయణపురం, బెండల్పహాడ్, బాజకుంట, కొండపాకగూడెం, 23న అమ్మనబోలు, శేరుబావిగూడెం, పోతనేనిపల్లి, శాపల్లి, తొండల్వాయి, ఔరవాణి, తిరుమలగిరి, ఎనుగులదోరి, 24న బ్రాహ్మణవెల్లంల, జువ్విగూడెం, నక్కలపల్లి, నెమ్మాని, గోపలాయపల్లి గ్రామ పంచాయతీల వద్ద గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మర్రిగూడ : కొత్త రేషన్కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా మంజూరుకు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామని ఎంపీడీఓ జి.చినమునయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభలో అర్హులను గుర్తించి పథకాలను వర్తింపజేస్తామన్నారు.

కనీస మద్దతు ధర చట్టం చేయాలి



నల్లగొండ టౌన్ : మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. కార్మిక కర్షక ఐక్యత దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక సుందరయ్య భవన్లో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి మాట్లాడుతూ రైతాంగానికి కనీస మద్దతు చట్టం, ఉపాధి హామీ రక్షణ, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా నాయకుడు కుంభం కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఊట్కూరి నారాయణరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ సరోజ, జిల్లా ఉపాధ్యక్షుడు మన్నెం భిక్షం, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి అరుణ, సైదులు, నరసింహ, భీమగాని గణేశ్, మధుసూదన్రెడ్డి, శ్రీను, గోలి నరసింహ కట్ట అంజయ్య, పేర్ల సంజీవ, పందుల లింగయ్య, వడ్డే ధనమ్మ, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి

మునుగోడు: కార్మికుల హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేసి తమ ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి కార్మికుడు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ కోరారు. ఆదివారం కార్మిక, కర్షక దినోత్సవం సందర్భంగా సీపీఎం కార్యాలయంలో కార్మికులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నాయన్నారు. వాటిని తిప్పి కొట్టేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండా శ్రీశైలం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏర్పుల యాదయ్య, సాగర్ల మల్లేష్, వరికుప్పల ముత్యాలు, వేముల లింగస్వామి, రామలింగాచారి తదితరులు పాల్గొన్నారు.

వేమన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

రామగిరి (నల్లగొండ): ప్రజా కవి యోగి వేమన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ప్రముఖ కథా రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కవితా దోస్తాన్ నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహించిన వేమన జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేమన పద్యాల్లో ఎన్నో నైతిక విలువలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని చదవాలని కోరారు. కవితా దోస్తాన్ వ్యవస్థాపకుడు, రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ నాటి సామాజిక సమస్యలపై యోగి వేమన తన పద్యాల ద్వారా ప్రజలను చైతన్యం చేశారని అన్నారు. కార్యక్రమంలో రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షుడు అలుగుబెల్లి రాంరెడ్డి, వైద్యులు శ్రీనివాస్, సైదిరెడ్డి, మురళీధర్, అసిస్టెంట్ లైబ్రేరియన్ కట్ట నాగయ్య, గ్రంథాలయ సిబ్బంది కుసుమ శ్రీ, మల్లేష్, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు

మహాసభలను విజయవంతం చేయండి

చిట్యాల: సంగారెడ్డిలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య కోరారు. సీపీఎం రాష్ట్ర మహాసభల ప్రచార పోస్టర్లను చిట్యాలలో ఆదివారం వారు విడుదల చేసి మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, మండల కమిటీ సభ్యులు బొబ్బలి సుధాకర్రెడ్డి, ఐదారాజు నర్సింహ, గుడిసె లక్ష్మీనారాయణ, ప్రజా సంఘాల నాయకులు పెర్క శంకరయ్య, ఏళ్ల మారయ్య, పాలమాకుల అర్జున్, నర్సింహ, వెంకట్రెడ్డి పాల్గొన్నారు.


కేతేపల్లి: సంగారెడ్డిలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఎం తెలంగాణ నాలుగో రాష్ట్ర సభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు పిలుపునిచ్చారు. ఆదివారం కేతేపల్లిలోని ఎస్ఎస్ఆర్ భవనంలో సీపీఎం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను పార్టీ నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, అశోక్రెడ్డి, కోట లింగయ్య, ఊర ఎల్లయ్య, వి.సౌదయ్య, బండమీది అంజయ్య, గుండాల కొమరయ్య

కనగల్ : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 25 నుంచి 28 వరకు జరగనున్న సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కనగల్ మండల సీపీఎం కార్యదర్శి కానుగు లింగస్వామి, మండల కమిటీ సభ్యులు కందుల సైదులు సుల్తానా, బోగరి భిక్షం, రాంబాబు వెంకన్న, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

నల్లగొండ టౌన్: టీఎస్జీఓ మెడికల్–హెల్త్ ఎంప్లాయీస్ ఫోరమ్ నూతన కమిటీని ఆదివారం నల్లగొండలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.సాయి శశాంక్ రెడ్డి, కార్యదర్శిగా మిర్యాల వెంకటపతి, కోశాధికారిగా ఎండీ.ముబీన్ అహ్మద్, అసోసియేట్ అధ్యక్షురాలిగా జె.అనురాధలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జె.శేఖర్ రెడ్డి, కోశాధికారి మెడి జయరావు, ఆకునూరి లక్ష్మయ్య, కె ప్రదీప్, భాస్కర్, దుర్గయ్య పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి గ్రామానికి చెందిన కట్టెల లింగస్వామి ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో అతడి వైద్య చికిత్స ఖర్చులకు గాను అతడితో కలిసి చదువుకున్న 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహితులు రూ.35 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం లింగస్వామికి అందజేశారు. సురోజు వీరాచారి, కొండ వెంకన్న, పనస శంకర్, నవీన్రెడ్డి, నర్సింహాచారి, లింగేశ్వర్, ఆడెపు శ్రీకాంత్ పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న స్నేహితులు



నల్లగొండ టౌన్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



చిట్యాల: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ టౌన్ : పట్టణంలోని బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009–10 విద్యా సంవత్సంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం లయన్స్ క్లబ్ భవన్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాటి ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు వెళ్లి అక్కడే నాటి ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సందీప్, లింగస్వామి, మేఘన పవన్ కళ్యాణ్, రేణుక, కవిత, తౌశిఫ్, రాజు,సైదులు, ఆనాటి హెచ్ఎం రవి ప్రసాద్, ప్రస్తుత హెచ్ఎం శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిట్యాల: పట్టణంలోని సరస్వతి జూనియర్ కళాశాలలో 2008–10 విద్యా సంవత్సరంలో ఇంటర్ చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమ చిన్ననాటి తరగతి గది జ్ఞాపకాలను ఒకరినొకరు గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

కనగల్ : మండల పరిధిలోని జి ఎడవల్లి ఉన్నత పాఠశాలలో చదివిన 1995–96 ఎస్సెస్సీ బ్యాచ్కు చెందిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు జి మోహన్రెడ్డి, అంజిరెడ్డి, పూర్వ విద్యార్థులు వనజాత, పూలమ్మ, సుమతి, రాణి, వరలక్ష్మి, స్వర్ణ, నిర్మల మోహన్ రెడ్డి, ఈశ్వర్, యాదయ్య, జనార్దన్, ఆసిఫ్, నరేందర్, శేఖర్ రెడ్డి, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కనగల్ : సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి



మాట్లాడుతున్న సరోత్తంరెడ్డి

నల్లగొండ టౌన్: జాతీయవాద భావప్రియ సంఘం అభ్యర్థి అయిన తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి కోరారు. నల్లగొండ పట్టణంలో ఆదివారం జరిగిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన జీపీఎఫ్, పెండింగ్ బిల్స్, డీఏలు, పీఆర్సీ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఇరుగు శ్రీరామ్, బత్తిని భాస్కర్గౌడ్ , అలుగుపల్లి పాపిరెడ్డి, తెలకలపల్లి పెంటయ్య, కట్టెబోయిన శ్రీనివాస్, సంతోష్రెడ్డి, నర్సిరెడ్డి, చనగోని యాదయ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

తిప్పర్తి : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్రెడ్డి, తుమ్మల వీరారెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, ఈతరం యూత్, అక్షర ఫౌండేషన్ల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పది గ్రామాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలు, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆదివారం మండల కేంద్రంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, నన్నూరి వెంకటరమణారెడ్డి, మన్నెం భిక్షం, జంజరాల సైదులు, భీమగాని గణేశ్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే



మునుగోడు: ఎల్లగలగూడెంలో సర్వే చేస్తున్న ఏఓ పద్మ, సిబ్బంది

మునుగోడు: రైతు భరోసా పథకానికి అర్హులైన వారిని గుర్తించేందుకు చేపడుతున్న సర్వే మునుగోడు మండలంలో కొనసాగుతోంది. సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పాటై సాగు చేయకుండా ఉన్న భూములను గుర్తిస్తున్నారు. కేవలం సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా అందించేలా నివేదిక సిద్ధం చేస్తున్నారు.

మర్రిగూడ : రైతు భరోసా అమలులో భాగంగా నిర్వహిస్తున్న సర్వే ఆదివారం మండలంలోని కమ్మగూడ, వెంకేపల్లి, తిరగండ్లపల్లి, రాజాపేటతండా గ్రామాల్లో నాలుగో రోజు ఆదివారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బక్క శ్రీనివాసులు సీనియర్ అసిస్టెంట్ ఉదావత్ శ్రీనునాయక్, ఏఓ విజయకుమార్, రమేష్ పాల్గొన్నారు.